క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

బనగానపల్లె: పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పలుకూరు, వెంకటాపురం, తిమ్మాపురం, అప్పలాపురం, టంగుటూరు గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. పంట నమోదు, పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏఓ సుబ్బారెడ్డి ఉన్నారు.

నియామకం



కటిక వేణు

డోన్: వైఎస్సార్‌సీపీ డోన్ మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా కౌన్సిలర్ కటిక వేణు నియమితులయ్యారు. ఆయన నియామకంపై మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కురుకుంద హరి హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

డోన్: పట్టణానికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని జీవం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కర్నూలు అపెక్స్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేయించారు. గురువారం ఆస్పత్రి నుంచి ఆమె డిశ్చార్జ్ అవడంతో వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని జీవం వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ మద్దూరి శివ అందజేశారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా సూర్యప్రతాప్

డోన్ రూరల్: పట్టణానికి చెందిన సూర్యప్రతాప్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యాడు. ఈ నెల 24న నంద్యాలలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లరాజు, నాజర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు.

డ్రైనేజీ పరిశీలన



బస్టాండ్ వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో గ్రామ పంచాయతీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించాలని ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డిను ఆదేశించారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

కానుకల ద్వారా రూ.2.30 లక్షల ఆదాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె సమీపంలో వెలసిన పాలుట్ల రంగనాథస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం లెక్కించారు. ఏడాది కాలానికి సంబంధించి రూ.2,30,022 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ ప్రధాన అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులు, భక్తులు రవి కుమార్, నాగరాజు, లక్ష్మీరమణ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీపై హర్షం



కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల: మాదిగ దండోరా జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ కష్టానికి ఫలితంగానే పద్మశ్రీ అవార్డు దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాజు అన్నారు. కేంద్రం ఇటీవల మందకృష్ణను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడంతో గురువారం కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ఆ సంఘం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మందకృష్ణ 1994లో మాదిగ దండోరా ఉద్యమాన్ని స్థాపించి ఎస్సీ వర్గీకరణ, గుండెజబ్బుల సమస్యల పిల్లల కోసం, ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు, రిజర్వేషన్ల కల్పనకు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కత్తి ఓబులేసు, నాగేశ్వరరావు, పెద్ద మునయ్య, సుబ్బరాయుడు, గోపాల్, భాస్కర్, పెద్దన్న, నాగన్న పాల్గొన్నారు.

బాపూజీ మార్గం అనుసరణీయం

- వాడవాడలా గాంధీజీ వర్ధంతి
- నివాళులర్పించిన అధికారులు, ప్రముఖులు



అవుకు అమ్మవారిశాలలో..



బనగానపల్లె: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

బనగానపల్లె రూరల్: అహింస మార్గంతో దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వక్తలు పేర్కొన్నారు. జాతిపిత గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వాడవాడలా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. బనగానపల్లెలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు పీఎస్ఎస్ సత్యనారాయణ, సెక్రటరీ శ్రీరామ వెంకటయ్య అన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్టీసీ బస్టాండ్ ఫోర్‌లైన్ రోడ్డుపై ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలవేసి గాంధీ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జంగంశెట్టి, సురేంద్రబాబు, గాధంశెట్టిమోహన్, బండారు ప్రకాష్, బలరామయ్య, శివరాజ్, నల్లగట్ల శివయ్య, భరతుడు, మురళి పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి సూపరింటెండెంట్ నాగరాజు, ఉద్యోగులు నివాళులర్పించారు.

జాతిపితకు నివాళి

డోన్: అహింస సిద్ధాంతంపై జాతి మొత్తాన్ని ఏకతాటిపై నిలిపి దేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహనీయుడు మహాత్మగాంధీ అని గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య కొనియాడారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బచ్చు సురేష్, సభ్యులు సముద్రాల బాబు, సాయిబాబా, గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, కుళ్లాయి, సాయి, నాగభూషణంరెడ్డి, హరి, బొగ్గరపు వెంకటేష్, పవన్‌కుమార్, రంగస్వామి పాల్గొన్నారు.

డోన్ టౌన్: మహాత్ముని ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పట్టణ ఆర్యవైశ్య, అవోపా సంఘం సభ్యులు అన్నారు. పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే పాతపేట శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్రను వివరించారు. అహింసా మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కరెస్పాండెంట్ నిర్మల, హెచ్‌ఎం లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: అహింస, శాంతి అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్య్రం తెచ్చిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్ అన్నారు. స్థానిక అమ్మవారిశాలలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, వనితా క్లబ్ ఇందుమతి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వాసవీ క్లబ్ కార్యదర్శి రమణ, సభ్యులు గుప్తా, రాజేష్, సురేష్, కల్కి సతీష్, కిశోర్ పాల్గొన్నారు.

అవుకు: స్థానిక అమ్మవారిశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు మేడం ఆంజనేయులు, మల్లెల సునీల్, తాళేపల్లె నాగేంద్ర, శంకర్, జీవీ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



డోన్: నివాళులర్పిస్తున్న గీతాయోగాసన సంఘం సభ్యులు



డోన్‌లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు..



బేతంచెర్లలో..

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



మాజీ మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు



వ్యవసాయ కూలీలు, రైతులతో మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ డోన్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు దూదేకుల అమ్మని(బేతంచెర్ల), వలంటీర్ల అధ్యక్షురాలు పశుల కీర్తి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు యాపమాను ఎర్రమల, ఆర్టీఐ అధ్యక్షుడు ఎం. రాఘవేంద్రారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిక్క వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బుగ్గనను కలిశారు. తమ నియామకానికి సహకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు ముర్తుజావలీ, ఖాజా హుసేన్, మురళీ, గుండా జగన్, సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా లేదు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ సంక్షేమ పథకాలు అందేవని.. ఎంతో లబ్ధి పొందామని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్థిక భరోసా దూరమైందని కొలుములపల్లె గ్రామానికి చెందిన మహిళా కూలీలు, రైతులు మాజీ మంత్రి బుగ్గనతో తమ గోడు వెల్లబోసుకున్నారు. గురువారం సాయంత్రం బేతంచెర్ల మండలం కొలుములపల్లె గ్రామంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యటించారు. గత ప్రభుత్వంలో పింఛన్లు మొదలుకొని, రైతు భరోసా, అమ్మఒడి, చేయూత ఇలా ప్రతి పథకం సమయానికి అందేదని వాపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చి 7 నెలలు పూర్తయినా ఒక్క పథకం అమలు చేయలేదన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో గురువారం ప్రభుత్వ మద్దతు ధరతో కంది కొనుగోలు ప్రారంభమైంది. ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరినాథ్‌రెడ్డి, నాఫెడ్ మేనేజర్ శాస్త్రి, డోన్ డీసీఎంఎస్ అవినాష్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ అవినాష్ రెడ్డి, ఏఓ కిరణ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

డోన్ టౌన్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సప్తశైల రాజేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడిపై దాడి



యువకుడిపై దాడి చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గురువారం రాత్రి యువకుడిని చితకబాదారు. పట్టణంలోని కొండపేటకు చెందిన ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఒక యువకుడిని కిందపడేసి విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘర్షణకు గల కారణాలపై విచారిస్తున్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కోవెలకుంట్ల: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగరాజు, నరసింహ, బాలవెంకట్, సుధాకర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత గురువారం కోవెలకుంట్లకు చేరుకుంది. అదానితో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించాలన్నారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బనగానపల్లె రూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు డిమాండ్ చేశారు. జీపుజాత గురువారం బనగానపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పెట్రోల్‌బంకు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ.16 వేల కోట్ల భారాన్ని మోపడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీ, చేతివృత్తిదారులకు రాయితీలు ఎత్తివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరులో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు సుబ్బయ్య, బాలవెంకటయ్య, నరసింహ పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!



లారీలో తీసుకొచ్చిన వ్యర్థపదార్థాలు

కొలిమిగుండ్ల: ఇతర ప్రాంతాల్లోని డంపింగ్ యార్డుల నుంచి తీసుకొచ్చిన వ్యర్థ పదార్థాలు, కొబ్బరి పీచుతో పాటు కెమికల్‌ను కలిపి మిక్స్ చేస్తుండడంతో వెలువడుతున్న దుర్వాసనతో మీర్జాపురం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి 2కి.మీ దూరంలో కొద్ది రోజుల క్రితం వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. చెత్తచెదారంతో పాటు కుళ్లిపోయిన, ఇతర వ్యర్థ పదార్థాలను వివిధ ప్రాంతాల నుంచి సేకరించి లారీల్లో ఈ యూనిట్‌కు తీసుకొస్తున్నారు. కొబ్బరి పీచును స్థానికంగానే పెద్ద ఎత్తున నిల్వ చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి కెమికల్‌ను తీసుకొచ్చి మూడింటిని ప్రాసెసింగ్ యూనిట్‌లో వేసి బర్నింగ్ చేస్తున్నారు. తద్వారా వచ్చిన పదార్థాన్ని సిమెంట్ కంపెనీలకు విక్రయిస్తున్నారు. వ్యర్థాలు కాల్చే సమయంలో వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. బయటకు రావాలంటేనే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన వల్ల చాలా మంది దగ్గు, జలుబు ఇతర వ్యాధుల బారిన పడుతున్నారు. ప్లాంట్‌కు చుట్టు పక్కల పొలాల్లో వెలువడుతున్న దుర్వాసనతో పనులకు వెళ్లలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా చిన్న పరిశ్రమ నెలకొల్పాలంటే ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి. ఇదేమి లేకుండా ఎలా నిర్మించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్లాంట్ విషయం అధికారులకు సైతం తెలియకపోవడం విశేషం. ప్రాసెసింగ్ యూనిట్ నుంచి వెలువడుతున్న దుర్వాసన నుంచి తమకు విముక్తి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు

కొలిమిగుండ్ల: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవుకు రిజర్వాయర్ నుంచి సరఫరా చేసే స్కీం చాలా కీలకంగా మారుతుందని, లీకేజీలను ముందుగానే గుర్తించి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. చాలా గ్రామాల నుంచి కూలీలు ఆటోల్లో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. ఇంత మంది వెళ్తుంటే స్థానికంగానే ఎందుకు ఉపాధి పనులు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. గతంలో ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు పోయే సమయంలో అంకిరెడ్డిపల్లె సమీపంలో ముగ్గురు మహిళలు ఆటో బోల్తా పడి మృత్యువాత పడిన విషయాన్ని సభలో గుర్తు చేశారు. ఉపాధి కూలీలకు వారానికి ఒకసారి వేతనాలు రావ డం లేదనే ఉద్దేశంతోనే బయటకు పోవాల్సి వస్తోందన్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. ఇటీవల ఓ వ్యక్తి రాత్రి సమయంలో వైద్యం కోసం వచ్చి ఎవరూ అందుబాటులో లేకపోవడంతో అవుకు వెళ్లే సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడని.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కారాదన్నారు. చెరువు కట్టలపై నడిచేందుకు వీలు లేనంతగా కంపచెట్లు పెరిగిపోవడంతో పాటు తూములు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయించాలని మైనర్ ఇరిగేషన్ ఏఈకి సూచించారు. పాఠశాలల్లో నాడు–నేడు పనులు చాలా చోట్ల అసంపూర్తిగా మిగిలిపోయాయని వాటిని పూర్తి చేయించాలని ఎంఈఓను కోరారు. మైనింగ్ శాఖ అధికారులు మండల మీట్‌కు వచ్చేలా చూడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డికి సూచించారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరై కింద స్థాయి సిబ్బందిని పంపడంపై అసహనం వ్యక్తం చేశారు. రాని అధికారులకు నోటీసులు అందించాలని ఆదేశించారు. పంటల బీమా కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేశారని.. పంటలకు నష్టం వాటిల్లినా ఎలాంటి ఇన్సూరెన్స్ రాలేదని సభ దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకొచ్చారు. గత ప్రభుత్వం రైతులపై భారం పడకుండా ప్రీమియం చెల్లించిందన్నారు. గ్రామాల్లో రేషన్ బియ్యం డోర్ డెలివరీ కాక లబ్ధిదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ఉపాధి పనులకు వెళ్లకుండానే ఇళ్ల వద్దనే హాజరు వేస్తున్నారని, కొన్ని చోట్ల చెరో సగం అన్నట్లుగా వాటాలు వేసుకుంటున్నారని.. అరికట్టకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని అధికారులకు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

- వార్డు కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత
- పారిశుద్ధ్య కార్మికులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా?
- పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?



మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్



సమస్యలపై ప్రశ్నిస్తున్న వార్డు కౌన్సిలర్లు

బేతంచెర్ల: ప్రతి నెలా సమావేశాలకు హాజరుకావడం మినహా సమస్యలను పరిష్కరించడం లేదు.. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలి.. సమావేశాలకు ఎందుకు హాజరు కావాలని వార్డు కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్లు ప్రస్తావించారు. చాలా కాలనీల్లో నీటి సమస్య ఉందని, ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో సమస్యను ఎలా పరిష్కరిస్తారని, అన్ని కాలనీల్లో సమానంగా అభివృద్ధి చేపట్టాలన్నారు. కొత్త బస్టాండు, వడ్డేపేట కాలనీల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, తాగునీరు వదిలేటప్పుడు సమాచారం ఇవ్వడం లేదని, డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయడం లేదని వార్డు కౌన్సిలర్లు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రహరీ గోడ, తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని వార్డు కౌన్సిలర్ షేక్ ముబీనా అసహనం వ్యక్తం చేశారు. కోటపేట, డ్రైవర్స్ కాలనీ, గొరిపేట కాలనీల వెంట ఉన్న కందకం అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. నాలుగు నెలలుగా నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే ఎలా అని కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య అన్నారు. నగర పంచాయతీలో అసిస్టెంట్ ఇంజినీర్ లేకపోవడంతో అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ స్థలాల్లో షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో కౌన్సిలర్లు కలగజేసుకుని గతంలో చర్చించిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ గతంలో చర్చించిన పనులకు నిధులు కేటాయించామని.. అయితే టెక్నికల్ సమస్య, సిబ్బంది లేకపోవడంతో పనులు జరగడం లేదన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా గోరుకల్లు రిజర్వాయర్ నీటితో పాటు బోరుబావుల నుంచి తాగునీటిని సరఫరా చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్లు మధు, శకుంతల, ఇబ్రహీం, కోట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టోత్సవాలు వాయిదా

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి నిర్వహించాల్సిన ప్రతిష్ట మహోత్సవాలు వాయిదా పడినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనివార్య కారణాలతో మూడు రోజులపాటు జరగాల్సిన ఉత్సవాలను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఉత్సవాలు ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాన్ని తర్వాత ప్రకటిస్తామని.. భక్తులు గమనించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: వెంకటాపురం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. వ్యవసాయానికి త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోవెలకుంట్ల సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్

అవుకు: సమాజంలో మహిళలపై ఎన్నో రకాలుగా దాడులు జరుగుతున్నాయని, కేవలం చట్టాలతోనే మహిళలకు రక్షణ ఉంటుందని రాష్ట్ర మహిళా కమిషనర్ రోఖా బేగం, కోవెలకుంట్ల సివిల్ జడ్జి అబ్దుల్ రహిమాన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు జరుగుతుంటాయని, ఐసీడీఎస్ సిబ్బంది నిరంతరం గ్రామాల్లో తిరుగుతూ చట్టాలపై గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పేద మహిళలు వారి సమస్యలపై కోర్టును ఆశ్రయిస్తే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారెడ్డి, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, అజామ్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని పాల్గొన్నారు.